క్లుప్తంగా

నేడు విద్యుత్ సరాఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: పట్టణలోని మెయిన్ రోడ్డు, జవహర్ నగర్, ఎంఆర్ఓ ఆఫీస్ రోడ్, రాజీవ్ నగర్, కాల్‌మార్క్స్ కాలనీ, యాదవ నగర్, 6 ఇంక్లైన్ కాలనీలలో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని భూపాలపల్లి టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ విశ్వాస్ రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో కృష్ణకాలనీలో ఫీడర్‌పై ఉన్న లైన్‌లో మరమ్మతు దృష్ట్యా అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పోర్ట్స్‌స్కూల్‌కు ఎంపిక


శ్రీచందన


గుజ్జు దీక్షిత్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా నుంచి స్పోర్ట్స్‌స్కూల్‌కు ఎంపికయ్యారు. జూలై8న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు గంట రాజయ్య కుమార్తె శ్రీచందన, గుజ్జు సురేష్ కుమారుడు దీక్షిత్‌లు స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగవ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. కాగా, శ్రీచందన ఆదిలాబాద్, దీక్షిత్ హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్‌స్కూల్‌కు ఎంపికయ్యారు. శ్రీచందన కాళేశ్వరంలోని గిరిజన బాలికల పాఠశాల, దీక్షిత్ మహదేవపూర్‌లోని గుడ్‌మార్నింగ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్నారు. జిల్లాలో కాళేశ్వరం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన కావటి లావణ్య (23) పురుగుల తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రేగొండ మండలం రేపాకపల్లే గ్రామానికి చెందిన లావణ్యకు చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన కావటి నరసింహస్వామికి మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా లావణ్యకు పిల్లలు పుట్టడం లేదని అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. దీంతో అత్తింటి వేధింపులు తట్టుకోలేక జూలై 29న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించి అనంతరం మెరుగైనా వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కూతురు మరణానికి ఆమె అత్త, బావ, ఇద్దరు ఆడబిడ్డలు, అల్లుడు కారణమని మృతురాలు తండ్రి గండు మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ జక్కుల శరత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరి బురదమయంగా మారిందని అన్నారు. విద్యార్థులకు తాగునీరు లేకపోవడం దారుణమని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ భాను ప్రతాప్ పాల్గొన్నారు.

మట్టి రోడ్లు కాదు.. తారు రోడ్లే..!


వెల్లంపల్లి గ్రామ శివారులోని లోలెవల్ కల్వర్టు వద్ద బురదమయంగా రోడ్డు


మట్టి రోడ్డుగా మారిన వెల్లంపల్లి-ఎంపేడు ప్రధాన తారు రోడ్డు

- చినుకుపడితే బురదమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

టేకుమట్ల: ఇసుక, మట్టి రవాణాలో భారీ వాహనాల రాకపోకలతో తారు రోడ్డు సైతం మట్టి రోడ్ల వలే మారిపోయాయి. దీంతో చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారి బురదమయం అవుతున్నాయి. మండలంలోని వెల్లంపల్లి-ఎంపేడు రోడ్డు రెండు సంవత్సరాలుగా భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమై ప్రస్తుతం తారు రోడ్డు అంటే నమ్మలేని దుస్థితి. ఎంపేడు-టేకుమట్లకు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రజలు మండల కేంద్రానికి నిత్యం సొంత వాహనాలపై ప్రయాణిస్తారు. వెల్లంపల్లి నుంచి ఎంపేడు వరకు పూర్తిగా రోడ్డు ధ్వంసం కావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ సమయంలో అదుపు తప్పి ద్విచక్ర వాహనదారులు పడిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వెల్లంపల్లి గ్రామ శివారులోని లోలెవల్ కల్వర్టు వద్ద రోడ్డు ధ్వంసం కావడంతో ఇటీవల మట్టి పోయడంతో వర్షాలు కురిసిన ప్రతీసారి మట్టి మొత్తం బురదమయమై ద్విచక్ర వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతుంది. అలాగే పల్లెల్లో రోడ్డు మొత్తం ధ్వంసమై ఎక్కడ చూసినా బురద గుంటలే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం నిధులు కేటాయించి రోడ్లకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఒడిపిలవంచ ఎర్ర చెరువు పరిశీలన


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నూతన కనెక్టివిటీ కోసం మండలంలోని ఒడిపిలవంచ ఎర్ర చెరువును శనివారం ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎర్ర చెరువును చిన్న కాళేశ్వరంలో ప్రాజెక్ట్ అనుసంధానం చేసి నీరు నింపాలని గతంలో పలువురు రైతులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ ఈఈ యాదగిరి, డీఈఈ ఉపేందర్ చెరువు విస్తీర్ణం, నీటి సామర్థ్యంపై క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. రైతులతో మాట్లాడి ఆయకట్టు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ పైపులైన్ నుంచి చెరువు దూరం, అవసరమయ్యే భూ సేకరణ సంబంధించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఈఈ యాదగిరి పేర్కొన్నారు. సర్వే నిర్వహించిన అనంతరం ప్రభుత్వ అనుమతితో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందన్నారు. అధికారుల వెంట నాయకులు కర్రు నారాయణ, భగవాన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ఏబీవీపీ నాయకుల అరెస్ట్


అరెస్ట్ అయిన ఏబీవీపీ నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఏబీవీపీ నాయకులను శనివారం భూపాలపల్లి పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేశారు. జిల్లా పర్యటనకు మంత్రులు వచ్చిన సందర్భంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివాజీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్న ఇప్పటి వరకు ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'పై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: ఈ నెల 5 నుంచి 9 స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యలయంలో అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు పారిశుద్ధ్యం, వైద్య సేవలు, మొక్కలు నాటడం, ర్యాలీలు, శ్రమదానం, వనమహోత్సవం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రఘురామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న పున్నం రవి

రేగొండ: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆదుకోవాలని గణపురంలో శనివారం పర్యటించిన మంత్రుల బృందానికి ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ పున్నం రవి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా జిల్లా కేంద్రంలో 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. జైలు జీవితం గడిపిన ఉద్యమకారులకు పింఛన్, ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులతో పాటు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైస భిక్షపతి, పట్టెం శంకర్, గోగుల అశోక్‌రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, సామర్ల శ్రీనివాస్, గుర్రాల సుమన్‌రెడ్డి, పత్తి బుచ్చిరెడ్డి, ముదురుకోళ్ల సుధాకర్, సోమిడి మోహన్‌రావు, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం, చర్చిపేట, నూగూరు గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్, సిబ్బంది కోటి రెడ్డి, మోహన్, రామకృష్ణ, రాజేశ్ తదితరులు ఉన్నారు.

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం: విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని రామన్నగూడెం పాఠశాలలో స్వచ్ఛదనం, పచ్చదనంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సమాజంపై అవగాహన కలగడం వల్ల జరగబోయే అనార్థాలు, సంఘటనలను ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానంలో శరణ్య, ద్వితీయ స్థానంలో రోహిత్, తృతియ స్థానంలో మనిష్ నిలిచినట్లు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానంలో రక్షిత, ద్వితీయ స్థానంలో సుష్మశ్రీ, తృతీయ స్థానంలో మహేందర్‌లు నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం


కాటారం: తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీఓ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు

కాటారం: తల్లిపాలు పట్టించడం ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ రాధిక అన్నారు. కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు విలాసాగర్, ధర్మాసాగర్, దామెరకుంట, జాదారావుపేట, గుండ్రాత్‌పల్లి, శంకరాంపల్లి, గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు, ముర్రుపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాధిక మాట్లాడుతూ.. పుట్టగానే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని వాటి వల్ల పిల్లలకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. చిన్నారులకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని ఆ తర్వాత అనుబంధ ఆహారం పెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ వీణ, అంగన్‌వాడీ టీచర్లు అమ్మక్క, అనసూర్య, అమృతరాణి, విమల, శ్యామల, కృష్ణవేణి, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. శనివారం మండలంలోని భూర్గుడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు పట్టించడం బిడ్డకి మొదటి టీకా వంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శివమ్మ, నీలమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమాన్ని సీడీపీఏ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్ ఒద్ది ఉమామహేశ్వరీ శనివారం నిర్వహించారు. తల్లులు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు తాగించాలని ఆమె అన్నారు.


చిట్యాల: మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి

రేగొండ మండలం గూడెపల్లిలో..

రేగొండ: పిల్లలకు తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం మండలంలోని గూడెపల్లి గ్రామంలో కొడవటంచ క్లస్టర్ సూపర్‌వైజర్ సామల సుజాత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు పట్టించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ప్రతి రోజు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లతో పాటు చిరుధాన్యాలలతో కూడిన భోజనాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. సుపర్‌వైజర్ జయప్రద, టీచర్ ఉమాదేవి, పిల్లల తల్లులు, గర్భిణీలు, ఏఎన్ఎం, ఆశవర్కర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.


పలిమెల: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శివరాణి


కాళేశ్వరం: పలుగుల అంగన్‌వాడీ కేంద్రంలో..


రేగొండ: గూడెపల్లిలో..

పారిశుద్ధ్య పనులు


పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ వీరస్వామి

కాటారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. శనివారం జాతీయ రహదారి 353(సీ)లో డివైడర్‌కు ఇరువైపులా మట్టి తీసివేయడంతో పాటు పలు కాలనీల్లోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలిగించారు. పారిశుద్ధ్య పనులను ఎంపీఓ వీరస్వామి పరిశీలించారు. రహదారుల వెంట పిచ్చి మొక్కలు తొలిగించి క్లోరినేషన్ ప్రక్రియ కొనసాగించాలని ఎంపీఓ ఆదేశించారు. ఎంపీఓ వెంట పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

ఏఈఈలుగా ఎంపికైన మండలవాసులు


భరద్వాజ్


కరిష్మా


మానసరెడ్డి


అనూష


నిరంజన్


వర్షిత

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన టీజీపీఎస్సీ ఫలితాల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆరుగురికి పలు శాఖల్లో ఏఈఈలుగా ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన బుర్ర వినీల్ భరద్వాజ్ ట్రైబల్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈఈగా ఎంపికయ్యారు. అలాగే జడలపేట గ్రామానికి చెందిన మెరుగు కరిష్మా (పంచాయతీ రాజ్), దొర్నాల మానసరెడ్డి (పంచాయతీరాజ్), మీన్నాపురం అనూష (ఆర్అండ్‌బీ), జూకల్ గ్రామానికి చెందిన పుట్టపాక నిరంజన్ (పీఆర్) చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన గూడెపు వర్షిత(పీఆర్) శాఖలో ఏఈఈలుగా ఎంపికయ్యారు. మండలంలో ఆరుగురు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబురాలు


సంబురాల్లో పాల్గొన్న నాయకులు

మహాముత్తారం: సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై సానుకూలంగా తీర్పును ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేసి టపాకాయలు కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుపాక లచ్చయ్య, మండలాధ్యక్షుడు పుల్యాల రాజయ్య, రమేష్, చందు, దేవేందర్, స్వామి, దుర్గయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మట్టెవాడ గట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు కిరణ్‌తో కలిసి పదవ తరగతి చదువుకున్న 2006 బ్యాచ్‌కి చెందిన మిత్రులు శనివారం బాధిత కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు భానుచందర్, లక్ష్మణ్, శ్రీకాంత్, రమాకాంత్, సాంబయ్య, రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- రూ.64 లక్షల విలువ గల 256 కిలోల గంజాయి పట్టివేత
- రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- అధికారులకు రివార్డులు..
- వివరాలు వెల్లడించిన కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: పెద్ద మొత్తంలో కారులో గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వారినుంచి రూ.64 లక్షల విలువ గల 256 కిలోల గంజాయి, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శనివారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. నిందితులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడుకు చెందిన బానోతు బాబు కుమారస్వామి, నస్పూరి కుమారస్వామిలు అరెస్టు కాగా మహబూబాబాద్‌కు చెందిన జిలేందర్, భూపాలపల్లికి చెందిన అంగోతు రాజేందర్, ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు డొంకరాయికి చెందిన ముకుంద్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు. ప్రధాన నిందితులు బానోతు బాబు కుమారస్వామి, నస్పూరి కుమరస్వామిలు కారు డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్న క్రమంలో మిగితా నిందితులతో పరిచయం ఏర్పడినట్లు సీపీ తెలిపారు. వీరంతా సులభంగా డబ్బులు సంపాదించాలని, ఇందుకు గంజాయి రవాణాను ఎంచుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని డొంకరాయి పరిసర ప్రాంతాలనుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేవారన్నారు. డొంకరాయిలో నిందితుడు ముకుంద్‌తో కలిసి 256కిలోల గంజాయిని కొనుగోలు చేసి, దానిని రెండు కిలోల చొప్పున 128 ప్యాకెట్లుగా చేసి, కారుల్లో భద్రపరిచి డొంకరాయి నుంచి భద్రాచలం మీదుగా మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. నర్సంపేట కమలాపురం క్రాస్‌లో టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా కార్లను అడ్డగించారన్నారు. తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించినట్లు సీపీ తెలిపారు. నిందితుడు బానోతు బాబు కుమరస్వామిపై గతంలోనూ గంజాయి కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. కమిషనరేట్‌ను గంజాయి ఫ్రీగా మార్చే ప్రయత్నంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అధికారులకు రివార్డులు...

గంజాయిని పెద్ద మొత్తంలో పట్టుకున్న అధికారులకు రివార్డులు అందజేస్తామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, రవికుమార్, నర్సంపేట ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి, టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్సైలు శరత్‌కుమార్, భానుప్రకాశ్, ఖానాపూర్ ఎస్సై రఘుపతి , ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు సురేష్, మహబూబ్‌పాషా, సాంబరాజు, రాజేష్, శ్రీనివాస్, సురేందర్, శ్రవణ్‌కుమార్, నాగరాజులను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.